క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో పాల్గుణ మాసం మంగళవారం కావడంతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తుల కోసం అన్న సమారాధన నిర్వహించారు.

పరీక్షకు 27 మంది గైర్హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. మూడు కేంద్రాల్లోనూ కలిపి మొత్తంగా 654 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 627 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



చింతపల్లి లాకుల వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధులు

పెదపూడి: మండలంలోని చింతపల్లి, జి.మామిడాడ, కాండ్రేగుల, రామేశ్వరం గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం విస్తతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని, రశీదులు లేని, ఆధారాలు లేని వస్తువులు, నగదు తరలిస్తే వాటిని నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామన్నారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేసి జిల్లా కలెక్టర్ వారి గ్రీవెన్స్‌కు పంపిస్తామన్నారు.

పల్లెల్లో పోలీసుల కవాతు



కోరుకొండలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

మధురపూడి: మే 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ సీఐ అడపా నాగమురళి, ఎస్సై డి.ఆనందకుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు చేశారు. కోరుకొండ, కాపవరం, జంభూపట్నం, గ్రామాల్లో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌తో ప్రత్యేక సందడి నెలకొంది.

వ్యక్తి అరెస్టు

ప్రకాశం నగర్: నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం రోడ్డు కం రైల్వే బ్రిడ్జి వద్ద అనుమానంగా ఉన్న వ్యక్తిని టూ టౌన్ సీఐ-2 వి.శ్రీనివాసరావు అరెస్టు చేసినట్టు సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. రోడ్డు కం రైల్వే బ్రిడ్జిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇన్నీసుపేటకు చెందిన బైగని రాజు(32) బైక్‌ను చోరీ చేసి తీసుకెళుతున్నట్టు అనుమానించి అరెస్టు చేసి, అతని నుంచి టీవీఎస్ రాడర్ 125 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

సారాతో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పాములగుడి సమీపంలో మంగళవారం రాత్రి 20 లీటర్ల సారాతో కొప్పిశెట్టి రామకృష్ణను అరెస్టుచేసినట్టు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకారావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్లంబర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ప్లంబర్ల రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరు రాజు అన్నారు. మంగళవారం బొమ్మూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని నేక్‌లో ప్లంబర్‌గా నైపుణ్యం కలిగిన 30 మందికి 'పూర్వఅభ్యసన గుర్తింపు' పేరుతో క్రాంప్టన్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేక్ ఏడీ జున్నూరి రాజు చేతుల మీదుగా శిక్షణ పొందిన 30 మంది ప్లంబర్లకు వాటర్ మేనేజ్మెంట్ అండ్ ప్లంబింగ్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సర్టిఫికెట్, ప్లంబింగ్ టూల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మీనాక్షి, ట్రైనర్ బి.రవిబాబు పాల్గొన్నారు.

మెట్టలో పశుగ్రాసం కొరత

- ఎండుగడ్డి దొరకడం గగనం
- ట్రాక్టరు రూ.15 వేల పైమాటే
- మిషన్‌తో కోసిన గడ్డికి పెరుగుతున్న డిమాండ్



యంత్రాలతో కోస్తున్న వరిని పోగు చేస్తున్న రైతు

రాజానగరం: వరి పంటను పండించడంలో జిల్లాలో ఎప్పుడూ ముందంజలో ఉండే మెట్ట రైతులు పశు గ్రాసం కొరతతో ఇబ్బంది పడుతున్నారు. వరి పంట కోతలకు అనుసరిస్తున్న యాంత్రిక విధానాలతో ఎండు గడ్డికి కరువు ఏర్పడుతుంది. దీనికి తోడు కొంతమంది రైతులు పొలాల్లోనే వరి పంటను కుప్పలు వేసి, నిల్వ ఉంచడం కూడా ఈ సమస్య తీవ్రతతమైంది.

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రాజానగరం, రంగంపేట, గండేపల్లి, జగ్గంపేట, కోరుకొండ, పరిసర మండలాలలో రబీ సీజన్‌కి సంబంధించిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రాల సాయంతో జరుగుతున్న ఈ వరి కోతల వల్ల గతంలో మాదిరిగా గడ్డిని ఆరబెట్టి, ఎండిన తరువాత కుప్పలుగా వేసి, నిల్వ చేసుకునే అవకాశం ఉండడంలేదు. దీంతో అనేక మంది రైతులు ఎండుగడ్డి లేక, పశుగ్రాసం కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, ప్రక్కనే ఉన్న కాకినాడ జిల్లా పరిధిలోని మురారి, గండేపల్లి వంటి కొన్ని ప్రాంతాలలో యంత్రాల సాయంతో రబీ వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వరి కుప్పలు వేయడంతో..

కొంతమంది రైతులు తాము పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర వచ్చిన తరువాతనే విక్రయిద్దామనే ఆలోచనతో వరి పంటను పండినచోటనే కుప్పలుగా వేసి, నిల్వ ఉంచుతారు. ఈ విధంగా వేసిన వరి కుప్పలను సాధారణంగా వేసవిలో ధర బాగున్న సమయంలో నూర్చి, ధాన్యం విక్రయిస్తుంటారు. అప్పటి వరకు ఆయా పంటల నుంచి వచ్చే ఎండుగడ్డిని పొందడానికి అవకాశం ఉండదు. ఆ విధంగా ఎండుగడ్డి కొరతకు వరి కుప్పలు కూడా కొంత కారణమవుతున్నాయి. అనేక రకాల పోషక విలువలతో కూడిన ఎండుగడ్డినే పశువుల దాణాకు ఎక్కువగా వాడుతుంటారు. కమతంలో మేట్లు (కుప్పలు) వేసి, ఏడాది పొడవునా ఆ గడ్డిని ఉపయోగిస్తుంటారు. దీనికి అదనంగానే పచ్చిగడ్డిని, తవుడు, చిట్టు వంటి వాటిని వాడుతుంటారు.

ముక్కలైనా సరే డిమాండే..

వరి కోత యంత్రం వరి గింజలను వేరు చేసే గడ్డిని తునాతునకలుగా నరికేస్తుంది. మొదట్లో ఈ విధంగా ముక్కలైన గడ్డి నిల్వకు ఉపయోగపడదని భావించిన రైతులు, దానిని భూమికి బలాన్నిస్తుందంటూ ఆయా పొలాలలోనే వదిలేస్తుండేవారు. కానీ నేడు ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతుండడంతో ముక్కలుగా అయిపోయిన గడ్డినే జాగ్రత్త చేసుకుంటున్నారు. గతంలో మాదిరిగా పొలంలో వదలడం లేదు. ప్రస్తుతం ఆ గడ్డికి కూడా మంచి డిమాండ్ ఏర్పడుతోంది. వరి పంట కోత అయిన తరువాత ఎకరం పొలంలో ఉన్న గడ్డిని రూ.వెయ్యిలకు విక్రయిస్తున్నారు.

యంత్రాలు ఉపయోగించడంతో



వరి పంటను కూలీలతో కోసినన్ని రోజులు ఎండుగడ్డికి సమస్య రాలేదు. అయితే త్వరగా కోతలు పూర్తి చేసేందుకు ఆధునిక పరిజ్ఞానంతో యంత్రాలను ఉపయోగించడం వలనే ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. యంత్రాలతో కోయడం వరి కోతలు వేగంగా జరుగుతున్నాయి గానీ గడ్డి ముక్కలైపోయి, నిల్వకు పనికిరాకుండా పోతోంది.

–సేనాపతి వెంకటరమణ, రైతు, సీతారామపురం

ఎండు గడ్డికి కొరత



యంత్రాలతో వరి కోతలు జరిగిన చోట గడ్డి ముక్కలై పోతుందని, నిల్వకు పనికి రాదని గతంలో వదిలేసేవారు. కానీ ఇప్పుడు ఆ గడ్డికే డిమాండ్ పెరిగింది. ఎండి గడ్డి కొరత ఉండడంతో ముక్కలైపోయిన సరే కొంటున్నారు. ట్రాక్టరు గడ్డిని కొనాలంటే రూ.15 వేలకు పైనే వెచ్చించాలి. దీనితో యంత్రాలు కోయడం వల్ల ముక్కలైపోతున్న గడ్డిని జాగ్రత్త చేసుకుంటున్నారు. దీనికి కూడా ఎకరం పొలంలో వచ్చే గడ్డికి ముందుగానే రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తోంది.

–అబ్బిరెడ్డి లక్ష్మణరావు, రైతు, తూర్పుగానుగూడెం

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



రామేశ్వరంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- రామేశ్వరంపేటలో ఎన్నికల ప్రచారం

రంగంపేట: ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రామేశ్వరంపేట, కొత్త కోటపాడు గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆదిలక్ష్మికి ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ ఫలాలు నిరంతరం కొనసాగాలంటే ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన ఉలవల మణికంఠ వైఎస్సార్ సీపీలో చేరడంతో ఆయనకు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, గవరసాని రాజు, అబ్బు, వీరబాబు, గుగ్గిల వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుదలకు ప్రతీక క్షీరసాగర మథన ఘట్టం

- ప్రవచన బాదరాయణి, శతావధాని తాతా సందీప్ శర్మ



ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న తాతా సందీప్‌శర్మ

సీటీఆర్‌ఐ: ప్రయత్నశీలానికి, పట్టుదలకు క్షీరసాగర మథన ఘట్టం ప్రతీకని ప్రవచన బాదరాయణి, శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు శ్రీవేంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణం ఆనుకొని ఉన్న శ్రీ షిర్డి సాయి మందిరంలో ద్వాదశ(12వ) వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు, మైలవరపు నారాయణ, దెందులూరి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం గోపూజతో మొదలు పెట్టి అభిషేకాలు, జపాలు చేశారు. వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదనగోపాలస్వామి దీక్షగా నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తాతా సందీప్ శర్మ ప్రవచనం చేశారు. వక్తను అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు సత్కరించారు. అనంతరం పెద్దిపట్ల శైలజ, శాస్త్రీయ భక్తి సంగీత కచేరితో అలరించారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన



వేమగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

కడియం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ప్రాధాన్యను గుర్తించి, రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలో వివరిస్తూ వేమగిరిలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని, ప్రజాస్వామ్య విలువను కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఏపీఎం బి.అప్పలకొండ, పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, డీపీఎం బి.హేమంత్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు డి.వి.సింహాచలం, కె.విజయలక్ష్మి, పలువురు యానిమినేటర్లు, స్త్రీ శక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సేంద్రియ వరి పంట నమూనాల పరిశీలన



అనంతపల్లి సహకార సంఘ కార్యాలయం వద్ద రైతులతో వ్యవసాయాధికారులు

నల్లజర్ల: మేలైన యాజమాన్య పద్ధతులతో మండలంలోని అనంతపల్లి గ్రామంలో సాగు చేసిన వరి పంట నమూనాలను రాష్ట్రస్థాయి సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అధికారి పి.వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని వరి పొలంబడి క్షేత్రాలను ఆయన సందర్శించిన రైతులు అనుసరిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, వాడిన ఎరువులు, పురుగు మందులు, వారు అవలంభిస్తున్న వ్యక్తిగత సంరక్షణ విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వన్యమృగ సంరక్షణ విధానాలు, కూలీల సంరక్షణ, ఆపద విధివిధానాలు, పర్యావరణ పరిరక్షణ, రైతు కూలీల సంక్షేమ విధివిధానాల గురించి రైతులను వాకబు చేశారు. మేలైన యాజమాన్య పద్ధతిలో పండించిన వరిపంటను పరిశీలించారు. వారి పంట నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి జయరామలక్ష్మి, కార్యక్రమం కో-ఆర్డినేటర్, రాజమహేంద్రవరం వ్యవసాయాధికారి ఎ.భీమరాజు, ఇంటర్నల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాబాబు, వ్యవసాయ సహాయకులు దుర్గా సురేష్, సుధీర్, జాన్‌పాల్, ఏఈఓ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

పురుగు మందుల అవశేషాలు లేవు

గత ఖరీఫ్ సీజన్‌లో అనంతపల్లి గ్రామ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి, పండించిన వరి పంటకు ఇండ్‌గ్యాప్ స్కోర్ సర్టిఫికెట్ లభించింది. ప్రభుత్వం వారి పంటను ల్యాబ్‌లో పరిశీలించాక, అందులో ఏవిధమైన పురుగు మందుల అవశేషాలు లేవని ధ్రువీకరించింది. ఈ ధ్రువీకరణ 2025 జూలై వరకూ చెల్లుబాటు అవుతుంది. ఈ ధ్రువీకరణతో అనంతపల్లిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులంతా తమ పంట ఉత్పత్తులను 127 దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉందని ఈ బృందం తెలిపింది. అయితే ఈ రబీ సీజన్‌లో కేవలం ఆరుగురు రైతులు మాత్రమే ఈ విధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వచ్చే ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులను ఈ ధ్రువీకరణ కిందకు తీసుకువచ్చి రైతులకు మరింత మేలు జరిగేలా చేస్తామని ఏవో కమల్ రాజ్ తెలిపారు. గోదావరి ఆయిల్ పామ్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా రైతులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీ ప్రతినిధులు భానుప్రతాప్, సురేష్, అన్నవరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీతో ఎస్‌కేవీటీ కళాశాల ఒప్పందం



ఒప్పందం చేసుకున్న కళాశాలల ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ : తెలుగు భాషాభివృద్ధి కోసం ఆర్ట్స్, ఎస్‌కేవీటీ కళాశాలల విద్యార్థులలో భాషా నైపుణ్యాలు మెరుగు కోసం పరస్పర ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్ర తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖాధిపతులు డాక్టర్ పి.ఎ.సత్య నారాయణ, ఎస్‌కేవీటీ తెలుగు శాఖాధిపతులు డాక్టర్ పి.వి.బి.సంజీవరావు కలిసి భవిష్యత్ ప్రణాళికలను, వ్యూహాలపై చర్చించి, భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ విద్యార్థుల భవిత కోసం వివిధ సంస్థలతో కలిసి కళాశాలలోని వివిధ శాఖలు పరస్పర ఒప్పందాలతో ముందుకు వెళతాయన్నారు. ఈ ఒప్పందం విజయవంతమయ్యేందుకు ఇరు సంస్థలు సంయుక్తంగా పని చేయాలని కోరారు.

ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని అన్ని బృందాలకు రాజమహేంద్రవరం సిటీ రిటర్నింగ్ అధికారి, కమిషనరు కె.దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ప్రవర్తన నియమావళి పర్యవేక్షించే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్సు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు పెట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులన్నీ సివిజిల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఉద్యోగులు ఎవరైనా రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు చేసే ప్రతి కార్యక్రమానికి 48 గంటల ముందు రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకోవాలని, సదరు కార్యక్రమాన్ని నిఘా బృందాలు పరిశీలించాలన్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచార కార్యక్రమం వివరాలు రిటర్నింగు అధికారికి సమర్పించాలని, పర్యటనలలో మార్పులు ఉంటే తెలియజేయాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిపే బాధ్యత నిఘా బృందాలపై ఉందని, వారి తమ బాధ్యతలను నిబద్ధతతో ఎటువంటి విమర్శలకు తావులేకుండా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీఎస్పీ, తహసీల్దారు కె.ఆంజనేయులు, సిటీ ప్లానరు జీవీఎస్ఎన్ మూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సందడిగా అమ్మవార్ల జాతర



జాతర ఊరేగింపులో గరగ నృత్యాల సందడి

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన కట్లమ్మ, దండు గంగమ్మవార్ల జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ గ్రామ వీధుల్లో భారీ ఎత్తున గరగల ఊరేగింపు జరిగింది. వందలాది భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొనడంతోగ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, కరీంనగర్ తీన్ మార్ డప్పు వాయిద్యాలు యువతను ఉర్రూతలూగించాయి. నృత్యాలతో యువకులు సందడి చేశారు. అమ్మవారి ప్రతిరూపంగా గరగలకు మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించారు. ఆసాదుల నృత్యాలతో గ్రామ యువకులు కాలు కదిపారు. పూలతో రూపొందించిన అమ్మవారి ప్రతిరూపం ఆకట్టుకుంది.

నేడు శ్రీలక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

చాగల్లు: చంద్రవరం గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాంగణంలో గ్రామస్తులు కొత్తగా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అగ్నిమథనం, అష్టకలశ స్థాపన, సప్తకలశ స్థాపన, నవకలశ స్థాపన, ధ్రువ మూర్తులకు పంచగవ్యాధివాసం, జలాధివాసం, సర్వదేవతా ఆవాహనం, మహాశాంతి హోమం వంటి పూజలు నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, ప్రథమారాధన, పీఠారోహణ, కళావాహనం పూజలు, అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

సమగ్రతా శిక్షణను పూర్తి చేసిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

ప్రకాశంనగర్: భారతదేశ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమగ్రత శిక్షణను ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎస్.అజయ్‌రావు పూర్తి చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్‌లో ఈనెల 16వ తేదీ నుంచి 22 వరకూ జరిగిన ఈ శిక్షణలో ఆంధ్ర రాష్ట్రం నుంచి 8 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేయగా అందులో ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన ఎస్.అజయ్‌రావు ఎంపిక అవ్వడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. 7 రోజులు జరిగిన ఈ శిక్షణ తరగతులలో ట్రెకింగ్, యోగ, ఫీల్డ్ విజిట్ వంటి కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు.

ఆరోగ్య జాగ్రత్తలపై సీహెచ్‌ఓలకు శిక్షణ



కోటికేశవరం పీహెచ్‌సీలో శిక్షణ ఇస్తున్న డాక్టర్లు సునీల్, రేష్మ

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం పీహెచ్‌సీలో మంగళవారం సీహెచ్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. కేర్ కాంపెయిన్ అనే కార్యక్రమంలో భాగంగా నూరా హెల్త్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్, డాక్టర్ రేష్మ శిక్షణనిచ్చారు. దానిలో కోటికేశవరంలో కోరుకొండ, దోసకాయలపల్లి, పాలచర్ల పీహెచ్‌సీలకు చెందిన సీహెచ్‌ఓలకు ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవల్లీ తదితరలు పాల్గొన్నారు.

బంగారు గొలుసు దొంగతనానికి యత్నం

బిక్కవోలు: మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన బలభద్రపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బలభద్రపురంలోని కాలువ గట్టు వీధి రామాలయం వద్ద కుమారి అనే మహిళ కిరాణా దుకాణం నడుపుతుంది. మంగళవారం ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై దుకాణానికి వచ్చి ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆమె గట్టిగా అరిచి అందరినీ పిలవడంతో బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై ఎస్‌ఐ పి.బుజ్జిబాబుని వివరణ కోరగా ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వార్తలు చూసి కానిస్టేబుళ్లను సదరు దుకాణానికి పంపినా తాము ఎలాంటి ఫిర్యాదు చేయలేదని బదులిచ్చారన్నారు. బాధితులు ముందుకు రాకపోయినా దొంగను పట్టుకునేందుకు యత్నిస్తామన్నారు.

వాటర్ కూలర్, ఫ్రీజర్ బహూకరణ

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు వృద్ధాశ్రమం, దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు దాతలు రూ.1.10 లక్షల విలువైన వాటర్ కూలర్, ఫ్రీజర్ విరాళంగా అందజేశారు.

ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి



రమీజ్‌ను సత్కరిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ రమీజ్‌ను ఆయన శాలువ కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్, షమీ భాయ్, చానా భాయ్, మీరా వలీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులపై పునఃపరిశీలన చేయాలి

ప్రకాశంనగర్: ఎన్నికలలో కరపత్రాల పంపిణీ, ఇంటింటి క్యాంపెయిన్ కోసం 48 గంటల ముందు రిటర్నింగ్ ఆఫీసరుల అనుమతి తీసుకోవాలనే అంశంపైన పునఃపరిశీలన చేయాలని సీపీఐ(యం) ప్రతినిధుల బృందం కోరింది. మంగళవారం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల సమావేశంలో మేడేకి ఎటువంటి ఆంక్షలు లేకుండా కార్యక్రమం నిర్వహణకు అనుమతించాలని కోరారు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు జెండా పోల్స్,దిమ్మెలు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశానికి కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.హరికిషోర్ హాజరయ్యారు.

చదువు కోసం ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల చదువు నిమిత్తం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో స్థానిక 16వ డివిజన్‌కు పద్మ అనే మహిళకు ఇద్దరు పిల్లల చదువు నిమిత్తం చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ పిల్లలను చదివించ లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని పద్మ కుటుంబానికి ఆర్థిక సాయం చేశామన్నారు.

శ్మశాన వాటికలో బోరు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు క్రైస్తవ శ్మశాన వాటికలో మంగళవారం జీసస్ సాల్వేషన్-సోషియల్ వర్క్ మినిస్ట్రీస్ వారు ఏర్పాటు చేసిన బోరును ఆ సంస్థ అధ్యక్షుడు పుత్ర హనోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హనోక్ మాట్లాడుతూ ఎంతో కాలంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ఇందుకు సహకరించిన కలెక్టర్, ఎంపీ, ఇతర ప్రభుత్వ పెద్దలకు క్రైస్తవుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ ప్రముఖులు బ్రదర్ పుత్ర జాకబ్ సుందర్, బిషప్ పొన్నామాటి బాబ్జి, ఐ.కిషోర్, అద్దంకి రాజా యోనా, మోర్తా ప్రభుదాస్, ఎం.జాన్, తూటే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.